క్లుప్తంగా

తాచుపాము కలకలం



స్థానికుడి చేతిలో హతమైన తెల్ల తాచుపాము

ద్వారకాతిరుమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ముఖ ద్వారం వద్ద మంగళవారం రాత్రి ఒక తాచుపాము కలకలం రేపింది. ఆ సమయంలో వసంత్‌నగర్ కాలనీ వైపు రాకపోకలు సాగిస్తున్న వారు ఏడడుగుల పొడవున్న ఈ తెల్లతాచు పామును చూసి ఒక్కసారిగా భయభ్రాంతులయ్యారు. అయితే ఒక వ్యక్తి ధైర్యం చేసి కర్రతో కొట్టి దాన్ని చంపాడు. దీంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

రైతులు విశిష్ట సంఖ్యను పొందాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

కొయ్యలగూడెం: అచ్చుతాపురం, పొంగుటూరు గ్రామాల్లో, పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏవో చెన్నకేశవులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకుని రైతులు ప్రత్యేక విశిష్ట సంఖ్యను పొందాలని ఆయన సూచించారు. ఈ సంఖ్య ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అనువయిస్తున్నట్టు రైతులకు తెలిపారు. మొక్కజొన్న పొగాకు పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మొక్కజొన్నలు కత్తెర పురుగు గమనించడంతో దీని నివారణకు స్పైనో సాడ్ అనే మందును పిచికారీ చేయాలని సూచించారు. ఏయే మోతాదులు ఏ మేరకు వాడాలో వ్యవసాయ శాఖ సిబ్బందిని రైతులకు తెలియజేయాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమ శాఖ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

చింతలపూడి: రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, యర్రగుంటపల్లి గ్రామంలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో మేస్సర్స్ శ్రీలావణ్య ట్రేడర్స్‌లో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలను గుర్తించి రూ.1,60,276 విలువైన 22,395 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. ధృవ పత్రాలు లేని రూ.16,050 విలువైన 9,550 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. అదే విధంగా సరైన ధ్రువ పత్రాలు లేని రూ.1,02,450 విలువైన 81,605 లీటర్ల పురుగు మందులను గుర్తించి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. దుకాణాదారుడిపై నిత్యావసరాల చట్టం కింద 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఏఓ జి.మీరయ్య, మండల వ్యవసాయ శాఖాధికారి కె.మీనాకుమారి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గుండె పోటుతో కూలీ మృతి

ఏలూరు (టూటౌన్): వలస కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక జన్మభూమి పార్క్ వెనుక ఉన్న తమ్మిలేరు కాలువలో ఉన్న గుర్రపు డెక్కను కొందరు కూలీలు తొలగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఉంగ్రాజువరం మండలం వడ్డూరు గ్రామానికి చెందిన ఎం.సూర్యారావు (60) ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. తోటి కూలీలు సూర్యారావు బంధువులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వడ్డూరు నుంచి సూర్యా రావు నాలుగు రోజుల నుంచి నిత్యం ఏలూరు వచ్చి వెళుతున్నట్లు తోటి కూలీలు తెలిపారు.

పంటల్లో పురుగుల నివారణకు అగ్ని అస్త్రం దోహదం

పెదవేగి : ప్రకృతి వ్యవసాయంలో అగ్ని అస్త్రం ఎంతగానో ఉపకరిస్తుందని ప్రకృతి వ్యవసాయ కొప్పాక యూనిట్ ఇన్‌చార్జ్ చందు సత్తిబాబు అన్నారు. పెదవేగి మండలం కొప్పాక యూనిట్‌కి సంబంధించిన సిబ్బందితో కలసి ఆయన సామూహికంగా మంగళవారం 200 లీటర్లు అగ్ని అస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ అగ్ని అస్త్రం వల్ల పంటలకు కలిగే ఉపయోగాలను వివరించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగుకు నివారణకు, వరి పంటలో కాండం తొలుచు పురుగు, లద్దె పురుగులను అరికట్టేందుకు అగ్ని అస్త్రం ఉపయోగపడుతుందన్నారు. ఎకరాకు 5 లీటర్ల అగ్ని అస్త్రం ద్రావణాన్ని 100 లీటర్ల నీళ్లు తీసుకుని పిచికారీ చేయాలన్నారు.

అధ్వాన రహదారి.. ప్రజలకు ఇబ్బంది

- తరచూ ప్రమాదాలతో ప్రయాణికుల బేజారు
- ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఆ రహదారిలోనే
- త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న స్థానికులు
- ఇదీ శ్రీనివాసపురం రహదారి దుస్థితి



జంగారెడ్డిగూడెం పట్టణంలో మట్టి రహదారిని తలపిస్తున్న, శ్రీనివాసపురం రోడ్డు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీనివాసపురం రోడ్డు ధ్వంసమైంది. అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు వణికిపోతున్నారు. పట్టణం నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గం కావడంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఏజెన్సీ గ్రామాల నుంచి జంగారెడ్డిగూడెం పట్టణానికి ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. మండలంలోని శ్రీనివాసపురం, మైసన్నగూడెం, పట్టిన్నపాలెం గ్రామాలతో పాటు, బుట్టాయగూడెం మండలంలోని రెడ్డిగణపవరం, గుబ్బలమంగమ్మ గుడికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఏ అవసరం వచ్చినా జంగారెడ్డిగూడెం పట్టణానికి రావాల్సిందే.

ఇదే దారిలో ప్రభుత్వ కార్యాలయాలు

శ్రీనివాసపురం రోడ్డులో ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో ఏదో ఒక పని మీద ప్రజలు ఈ రహదారిలో నిత్యం ప్రయాణిస్తుంటారు. రహదారి వెంబడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రిజిస్ట్రేషన్ కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు ఉన్నాయి. అలాగే సీఎస్ఆర్ మాల్, కల్యాణ మండపాలు ఉన్నాయి.

అడుగడుగునా గోతులు

ఈ రహదారిలో రిలయన్స్ స్మార్ట్ మాల్, తాండ్ర పాపారాయుడు సెంటర్, సీఎస్ఆర్ మాల్, కాలేజ్ రోడ్డు జంక్షన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి వద్ద, పలు ప్రాంతాల్లో అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనమే కాదు చివరికి సైకిల్‌పై వెళ్లే వారికి సైతం ఈ రోడ్డు అసౌకర్యంగానే ఉంటుంది. అధ్వానంగా ఉన్న రహదారి నుంచి మట్టి ఎగసిపడి నివాసాలు, వ్యాపార సముదాయాల్లోకి చేరుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్రీనివాసపురం రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మోటార్‌సైకిల్‌పై వెళ్లలేకపోతున్నాం

ఈ రోడ్డులో మోటార్‌సైకిల్‌పై కూడా వెళ్లలేకపోతున్నాం. అడుగడుగునా గోతులతో నరకం చూస్తున్నాం. దుమ్ము ఎగసిపడటంతో శ్వాసకోశ ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అధికారులు రహదారి పరిస్థితి గమనించి చర్యలు తీసుకోవాలి

-ఎస్.నాగేశ్వరరావు, జంగారెడ్డిగూడెం

రహదారి పూర్తిగా ధ్వంసమైంది

చాలా రోజులుగా రోడ్డు పరిస్థితి ఇలాగే ఉంది. కొన్ని చోట్ల రోడ్డు ఉందో లేదో తెలియనట్లుగా పూర్తిగా ధ్వంసమైంది. పెద్దపెద్ద గోతులతో ప్రయాణం కష్టంగా ఉంది. అనారోగ్య సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. ఇబ్బందులను పరిశీలించి అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలి.

-సీహెచ్ రాజబాబు, జంగారెడ్డిగూడెం

రైతులకు న్యాయం చేయాలి

చింతలపూడి: చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చే విషయం తేల్చి పనులు ప్రారంభించాలని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటితున్నా ప్రభుత్వం ఇంత వరకు పథకం విషయంలో నోరెత్తడం లేదని విమర్శించారు. లక్షల రూపాయల విలువైన భూములను కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల సాగునీటి ఇబ్బందులు తీర్చడానికి అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చింతలపూడి పథకానికి రూపకల్పన చేశారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాబార్డు నుంచి రూ.19 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వం మొదటి విడత పనులు పూర్తి చేసి పశ్చిమ గోదావరి రైతులకు నీళ్లు ఇచ్చాకే రెండో విడత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వంతెన నిర్మించండి



కొణిజర్ల వెళ్లే రహదారిలో మూడు రోడ్ల కూడలి వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

లింగపాలెం: కొణిజర్ల నుంచి ధర్మాజీగూడెం వచ్చే ప్రధాన రహదారిలో ఏటి కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన ఇటు ధర్మాజీగూడెం, అటు కొణిజర్ల మరోవైపు మఠంగూడెం వెళ్లే మూడు రోడ్ల కూడలిలో ఉంది. ఈ వంతెన మీద నుంచి నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తూంటారు. ఈ మూడు గ్రామాలకు చెందిన రైతులు ఈ వంతెన నుంచే వ్యవసాయ పనులు చేసుకునేందుకు వెళతారు. ఈ వంతెన శిథిలమవడంతో దీనిపై నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు అనేక సార్లు ఈ కాలువలో పడి ప్రమాదాలకు గురయ్యాయి. రాత్రి సమయంలో ఈ వంతెన వద్దకు వచ్చే సరికి వాహనదారులు భయపడుతున్నారు. ఇక్కడ కొత్త వంతెన నిర్మించాలని అనేక పర్యాయాలు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఎంఆర్‌పీఎస్ సమావేశాన్ని జయప్రదం చేయండి



ఎంఆర్‌పీఎస్ సమావేశం వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

పోలవరం రూరల్: ఈ నెల 23న అనంతపురంలో ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు విస్సంపల్లి సిద్దు మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పోలవరంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు ఉంద్రాజవరపు వెంకట రమణమూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లాలో ఉన్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఆగస్టు ఒకటిన ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జీల ధర్మాసనం తీర్పు అనంతరం మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్‌కు గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తున్నారన్నారు. అనంతరం సమావేశ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిడి చైతన్య కుమార్, కంభం జ్ఞాన సుందరం, చాపల రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్య బలోపేతానికి జ్ఞానజ్యోతి శిక్షణ



కామవరపుకోట: అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సీడీపీఓ బ్యూల

జంగారెడ్డిగూడెం: పునాది దశలోనే విద్యను బలోపేతం చేయడం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని జిల్లా స్థాయి పరిశీలకులు ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూల, దూబచర్ల డైట్ లెక్చరర్ ఎస్‌కే అబ్దుల్ అజీజ్ అన్నారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో మంగళవారం మండల జ్ఞానజ్యోతి 120 రోజుల ప్రోగ్రామ్‌లో భాగంగా మండల స్థాయి ఎఫ్ఎల్ఎస్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో ఆరు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం ఉంటుందని, అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పునాది దశలోనే విద్యను సమర్థవంతంగా అందించడంపై శిక్షణ ఇస్తామన్నారు. జంగారెడ్డిగూడెం మండలం నుంచి 72 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనుండగా, కామవరపుకోట మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సుమారు 50 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమం ఈ నెల 25 వరకు కొనసాగుతుందన్నారు.

శిక్షణా తరగతులు ప్రారంభం

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా విధానంపై ఆరు రోజుల పాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చే శిక్షణా తరగతులను నిర్వహించారు. కేంద్రంలో పాఠ్యాంశాల బోధన, నిర్వహణ, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి తెలిపారు.

ప్రీ స్కూల్ విద్యను బలోపేతం చేయాలి

కామవరపుకోట: శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ప్రీ స్కూల్ విద్యను బలోపేతం చేయాలని సీడీపీఓ పి.బ్యూల అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం మండల విద్యాశాఖ అధికారులు డి.సుబ్బారావు, చిన్న ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీఓ బ్యూల మాట్లాడుతూ మండల పరిధిలో 50 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను ఆరు రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జ్ఞానజ్యోతి శిక్షణ అంగన్‌వాడీ కార్యకర్తలకు పునాది లాంటిదని, అభ్యాసనను బలోపేతం చేయడం పిల్లలు ఆటలు, పాటలతో అభ్యసన చేయటం, తల్లిదండ్రులు సమాజ భాగస్వామ్యం వంటి తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆమె అవగాహన కల్పించారు. ఈ శిక్షణ అంగన్‌వాడీలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ తరగతుల రిసోర్స్‌పర్సన్స్ ఎం.రత్నరాజు, కె.గిరిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ ఎస్.వీరా కుమారి, బీవీఎల్ మంగాదేవి పాల్గొన్నారు.

టీడీపీ నేతపై చర్యలు చేపట్టాలి



ద్వారకాతిరుమల: డీటీ దుర్గా మహాలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు



లింగపాలెం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

ద్వారకాతిరుమల: పాత్రికేయులపై దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మికి స్థానిక పాత్రికేయులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు పానమాల నాగరాజు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని మక్కువ మండలంలో ప్రజాశక్తి రిపోర్టర్‌గా పని చేస్తున్న రామారావుపై దాడి చేసి, చంపేస్తామని బెదిరించిన, ఆ మండల టీడీపీ అధ్యక్షుడు వేణుగోపాల నాయుడుపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సామాజిక సేవే పరమావధిగా పాత్రికేయ వృత్తిని సాగిస్తున్న వారిపై దాడులు చేయడం దారుణమన్నారు. వేణుగోపాల నాయుడిపై చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

దాడి అమానుషం

లింగపాలెం: మన్యం జిల్లా పార్వతీపురం నియోజకవర్గం మక్కువ మండలం ప్రజాశక్తి విలేఖరి రామారావుపై టీడీపీ నాయకుడు గుల్ల వేణుగోపాల్ దాడి చేసి చంపుతానని బెదిరించడం అమానుషమని లింగపాలెం మండల విలేకరులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దార్ ప్రసాద్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా లింగపాలెం మండలం విలేకరుల గౌరవ అధ్యక్షుడు ఎస్‌డీవీ ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ నాయకుడు బెదిరింపులకు దిగటం అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో విలేకరుల మండల అధ్యక్షుడు ఎస్‌డీ లతీఫ్, కార్యదర్శి జి.కుమార్ మంగళం, కె.ఏడుకొండలు, సీహెచ్ శ్రీనివాసరావు, కె.శ్రీను, ఆర్.మోహన్, ఎల్.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ షాపులపై కేసులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు ఫర్నీచర్, పరుపుల షాపుల్లో విజిలెన్స్, తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. శ్రీ సాయి సుజాత ఎంటర్ ప్రైజస్, సుస్మిత ట్రేడర్స్ షాపులను తనిఖీ చేసి మొత్తం 5 కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై కె.సీతా రాము, ఏలూరు తూనికలు కొలతల అధికారి, వి.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

మద్ది క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆంజనేయుడిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కోలాటం నిర్వహిస్తున్న వేణుగోపాల కోలాట భజన మండలి సభ్యులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మధ్యాహ్నం వరకు పలు సేవల రూపేణ రూ.1,32,693 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. ఆలయం వద్ద ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన వేణుగోపాల కోలాట భజనమండలి వారిచే కోలాటం ప్రదర్శించారు. సుమారు 1500 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి.చందన తెలిపారు.

దాసాంజనేయునికి లక్ష తమలపాకుల పూజ

దేవులపల్లి గ్రామంలో కొలువైన ఈ దాసాంజనేయ పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానం 16వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి సింధూర సహిత లక్ష తమలపాకుల పూజా కార్యక్రమం నిర్వహించారు. విశేషం హోమం, గోపూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు, పంచ హారతులు, పంచామృత అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శాంతి కల్యాణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

సుందరగిరిపై విశేష హోమాలు



హోమాలు చేస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై మంగళవారం విశేష హోమాలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈహోమాలు నిర్వహించారు. గర్భాలయంలో కొలువైన శ్రీకనకవల్లీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పండితులు ఆలయ యాగశాలలో వేద మంత్రోచ్చరణలతో సుదర్శన నారసింహ ధన్వంతరీ, గరుడ, ఆంజనేయ, అనంత, సుబ్రహ్మణ్య, మూలమంత్ర హోమాలను నిర్వహించారు.

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన కారు



దుకాణం వద్ద డ్రైనేజీలోకి దూసుకెళ్లిన భక్తుడి కారు

ద్వారకాతిరుమల: స్థానిక బైపాస్ రోడ్డులోని ఓ దుకాణం వద్ద ఒక భక్తుడి కారు మంగళవారం డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం ప్రకారం. ఒక భక్తుడు కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న అనంతరం స్మార్ట్‌లోకి వెళ్లి, తనకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేశాడు. తిరుగు ప్రయాణం అయ్యే క్రమంలో కారు అదుపు తప్పి, ఎదురుగా ఉన్న డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. వెంటనే అప్రమత్తమైన భక్తుడు కారును నిలిపివేశాడు. ఆ తరువాత స్థానికుల సహాయంతో కారును బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ప్రభుత్వంలోని పలు శాఖల్లో పని చేస్తున్న ఆప్కాస్ ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు సమస్యల పరిష్కారానికి దశలవారీ ఆందోళన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ మాట్లాడుతూ ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు వేతన భద్రత లేని కారణంగా పలు అవస్థలు పడుతున్నారన్నారు. మున్సిపల్ శాఖలో పలు విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో మెప్మా సెర్ప్‌లలో పని చేస్తున్న ఉద్యోగులకు అప్పటి ప్రభుత్వం హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించిందన్నారు. అలాగే మున్సిపల్ శానిటరీ, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మార్చి ఆరున విజయవాడలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు కంతేటి వెంకటరావు, పారిశుధ్య విభాగం కార్యదర్శి బొక్కా శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ కార్యదర్శి నిమ్మల సుబ్బారావు, కొత్తూరి ఏమిలేశ్వరావు, కలపాల చంటియ్య, అయినాల ముత్యాలరావు, దోసూరు నాగరాజు, కొత్తూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.